# కరెంట్ అఫైర్స్

## విశ్వంలో ఇస్రో వేదిక

- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ44 (పీఎస్ఎల్వీ-డీఎల్) అనే వినూత్న ఉపగ్రహ వాహకనౌకను 2019, జనవరి 24న విజయవంతంగా ప్రయోగించింది.
- ఈ రాకెట్ ద్వారా ముందుగా డీఆర్డీవోకు చెందిన 740 కిలోల మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టింది. తర్వాత రాకెట్‌లోని నాలుగో దశను వ్యర్థంగా వదిలేయకుండా మరింత ఎత్తులోకి తీసుకెళ్లి అంతరిక్ష పరిశోధనలకు వేదికగా ఉపయోగపడేలా తీర్చిదిద్దింది. ఈ తాత్కాలిక వేదిక మన దేశానికి చెందిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలు చేసుకునేందుకు ఆరునెలలపాటు ఉపయోగపడనుంది. ఈ దశలో తమిళనాడులోని హైస్కూల్ విద్యార్థులు తయారుచేసిన కలాంశాట్ - వీ2 అనే 1200 గ్రాముల చిన్న ఉపగ్రహాన్ని ఉంచింది.
- పీఎస్ఎల్వీ సిరీస్‌లో 46వ ప్రయోగమైన పీఎస్ఎల్వీ-సీ 44 రాకెట్‌ను మొదటిసారిగా రెండు స్ట్రాపాన్ బూస్టర్లతో రూపొందించి విజయవంతంగా ప్రయోగించారు.
- పీఎస్ఎల్వీ-సీ44 ముందుగా మైక్రోశాట్-ఆర్ ఉపగ్రహాన్ని భూమికి 274 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ పోలార్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఆ తర్వాత కలాంశాట్-వీ2 ను 453 కిలోమీటర్లు ఎత్తులోని సన్‌సింక్రనస్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.

## నజీర్ అహ్మద్ వనీకి 'అశోకచక్ర'

- జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ అమరుడైన లాన్స్ నాయక్ నజీర్ అహ్మద్‌వనీకి శాంతికాలంలో ఇచ్చే అత్యున్నత సాహస పురస్కారం 'అశోకచక్ర'ను కేంద్రం ప్రకటించింది. ఈ పురస్కారాన్ని ఆయన భార్య మహజబీన్‌కు జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రదానం చేశారు.
- గత ఏడాది నవంబరు 25న షోపియాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. నజీర్ అహ్మద్ ఒకప్పుడు కశ్మీరీ మిలిటెంట్. హింసతో సాధించేది ఏమీలేదని గుర్తించి ఆ భావజాలాన్ని వదిలేసి లొంగిపోయారు. 2004లో ఆయన కశ్మీర్‌లోని 162వ టెర్రిటోరియల్ ఆర్మీ బెటాలియన్‌లో చేరారు. దక్షిణ కశ్మీర్‌లో ఈ బెటాలియన్ నిర్వహించిన ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ఉగ్రవాదులను అంతమొందించారు. ముష్కరులపై పోరులో చూపిన ధైర్య సాహసాలకు గుర్తింపుగా ఆయనకు 2007, 2018లలో రెండుసార్లు 'సేనా పురస్కారం' లభించింది.

## నేతాజీ మ్యూజియం ప్రారంభం

- స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 122వ జయంతిని 2019, జనవరి 23న దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ఆయనకు అరుదైన గౌరవం కల్పించింది.
- దిల్లీలోని ఎర్రకోటలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పేరుతో మ్యూజియాన్ని ప్రధాని నరేంద్ర మోదీ జనవరి 23న ఆవిష్కరించారు. అలాగే జలియన్ వాలాబాగ్ ఊచకోత, మొదటి ప్రపంచ యుద్ధంలో భారత సైనికుల స్మృత్యర్థం 'యాదే జలియన్ మ్యూజియం', భారత కళలకు సంబంధించి 'దృశ్యకళ మ్యూజియం', 1857 తొలి స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలను గుర్తుకుతెచ్చేలా మరో మ్యూజియాన్ని ప్రధాని మోదీ ఎర్రకోటలో ప్రారంభించారు. ఈ నాలుగు మ్యూజియాలను కలిపి 'క్రాంతి మందిర్'గా వ్యవహరిస్తారు.

## 15వ ప్రవాసీ భారతీయ దివస్

- 2019, జనవరి 21 నుంచి 23 వరకు 15వ ప్రవాసీ భారతీయ దివస్‌ను వారణాసిలో నిర్వహించారు.
- జనవరి 21న నిర్వహించిన 'యువ ప్రవాస భారతీయుల దినోత్సవం'లో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ స్వాగతోపన్యాసం చేశారు.


wwww.eenadupratibha.net

- జనవరి 22న 15వ ప్రవాసీ భారతీయ దివస్‌ని ప్రధాని మోదీ ప్రారంభించి ప్రసంగించారు. మారిషస్ ప్రధాన మంత్రి ప్రవింద్ జగన్నాథ్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'రోల్ ఆఫ్ ఇండియన్ డయాస్పోరా ఇన్ బిల్డింగ్ న్యూ ఇండియా' అనే థీమ్‌తో నిర్వహించారు.
- జనవరి 23న జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పాల్గొన్నారు. మొత్తం 28 మంది ప్రవాస భారతీయులకు, రెండు సంస్థల (గయానా హిందూ ధార్మిక సభ, ఇండియన్ కమ్యూనిటీ అసోసియేషన్ ఇన్ ఈజిప్ట్)కు ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. పురస్కార గ్రహీతల్లో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథ్, నార్వే ఎంపీ హిమాంశు గులాటీ తదితరులు ఉన్నారు.

## ఐసీసీ అవార్డుల్లో కోహ్లీ ట్రిపుల్ ధమాకా

- 2019, జనవరి 22న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 2018 వార్షిక పురస్కారాలను ప్రకటించింది. ఈ పురస్కారాల్లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మూడు పురస్కారాలను గెలుచుకుని వార్తల్లో నిలిచాడు.
- 2018లో అత్యుత్తమ ప్రదర్శనకుగాను 'ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా సర్ గ్యారీఫీల్డ్ సోబర్స్ ట్రోఫీని వరుసగా రెండోసారి గెలుచుకుని కోహ్లీ చరిత్ర సృష్టించాడు. దీంతోపాటు టెస్టు, వన్డే క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్‌గానూ నిలిచి హ్యాట్రిక్ అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఐసీసీ చరిత్రలో ఒకే ఏడాది మూడు ప్రధాన అవార్డులు సాధించిన తొలి ఆటగాడిగా కోహ్లీ నిలిచాడు. అంతేకాకుండా ఐసీసీ టెస్టు, వన్డే జట్ల కెప్టెన్ ఆఫ్ ది ఇయర్‌గా కోహ్లీ ఎంపికయ్యాడు.
- 2018లో 13 టెస్టుల్లో 5 శతకాలు నమోదు చేసిన కోహ్లీ 55.08 సగటుతో 1322 పరుగులు చేశాడు. 14 వన్డేల్లో 6 సెంచరీలతో 133.55 సగటుతో 1202 పరుగులు సాధించాడు. పది టీ20ల్లో 211 పరుగులు తీశాడు.
- టెస్టులు, వన్డేల్లో 2018లో అరంగేట్రం చేసిన భారత వికెట్ కీపర్ రిషబ్‌పంత్‌కు 'ఎమర్జింగ్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం లభించింది. ఐసీసీ టెస్టు జట్టు కీపర్‌గానూ పంత్ ఎంపికయ్యాడు. విరాట్‌కోహ్లీ, పంత్‌లతోపాటు జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఐసీసీ టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రాలు ఐసీసీ వన్డే జట్టులో చోటు పొందారు.
- ఐసీసీ స్పిరిట్ ఆఫ్ క్రికెట్ అవార్డును న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్, ఐసీసీ అంపైర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని కుమార ధర్మసేన (శ్రీలంక) గెలుచుకున్నారు.

## 'భారతరత్న'లుగా ప్రణబ్, నానాజీ, హజారికా

- 2019 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం జనవరి 25న దేశంలోని అత్యున్నత పౌరపురస్కారం 'భారతరత్న'ను ముగ్గురు ప్రముఖులకు ప్రకటించింది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జనసంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్, అస్సామీ గాయకుడు భూపేన్ హజారికాలను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. నానాజీ, హజారికా పేర్లను మరణానంతరం పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రకటించింది. నాలుగేళ్ల విరామం తర్వాత భారతరత్న పురస్కారాలను ప్రకటించారు.
- చివరిసారిగా 2015లో మోదీ ప్రభుత్వం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు మదన్ మోహన్ మాలవీయలకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. తాజాగా ప్రకటించిన ముగ్గురితో కలిపి భారతరత్న పొందిన ప్రముఖుల సంఖ్య 48కి చేరింది.
- తాజాగా కేంద్ర ప్రభుత్వం 11 మంది విదేశీయులు సహా 112 మంది ప్రముఖులకు 'పద్మ' పురస్కారాలను కూడా ప్రకటించింది. ఇందులో నలుగురిని పద్మవిభూషణ్, 14 మందిని పద్మభూషణ్, 94 మందిని పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. యెమెన్ నుంచి భారతీయులతో పాటు, వివిధ దేశాల వారిని రక్షించడంలో కీలకపాత్ర పోషించిన జిబౌటి అధ్యక్షుడు ఇస్మాయిల్ ఒమర్ గులేహ్ (విదేశీయుడు - ప్రజాసంబంధాలు), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జానపద గాయని తీజన్‌బాయి (కళలు), మహారాష్ట్రకు చెందిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ అనిల్ కుమార్ మణిభాయ్ నాయక్ (వర్తకం, పరిశ్రమలు), మహారాష్ట్రకు చెందిన రంగస్థల కళాకారుడు బల్వంత్ మోరేశ్వర్ పురంధరెలకు (కళలు - నటన - థియేటర్)పద్మవిభూషణ్ పురస్కారాలు ప్రకటించింది.
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు వ్యక్తులకు ఈ ఏడాది పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. ఏపీ నుంచి ప్రముఖ చెస్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక, వ్యవసాయ రంగం నుంచి ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, తెలంగాణ నుంచి ప్రఖ్యాత సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్, ప్రముఖ ఆటగాడు సునీల్ ఛెత్రిలను పద్మశ్రీ వరించింది.

## మాదిరి ప్రశ్నలు

**1.** 2019 భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరయ్యారు?

1) రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

2) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

3) ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడొడొ

4) దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా

**2.** 2019, జనవరి 24న చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎవరు హాజరయ్యారు?

1) రామ్‌నాథ్ కోవింద్ 2) వెంకయ్య నాయుడు

3) నరేంద్ర మోదీ 4) హర్షవర్ధన్

**3.** బేటీ బచావో... బేటీ పడావో (బీబీబీపీ) కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసినందుకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ తెలుగు రాష్ట్రాల్లోని ఏ జిల్లాలకు జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసింది?

1) నెల్లూరు, కరీంనగర్ 2) కడప, సిద్ధిపేట

3) అనంతపురం, ఆదిలాబాద్ 4) విశాఖపట్నం, మెదక్

**4.** అనారోగ్యంతో ఉన్న కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ చేతుల్లో ఉన్న ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ బాధ్యతలను ప్రధాని మోదీ సూచనల మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎవరికి అప్పగించారు?

1) హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

2) విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్

3) రైల్వే, బొగ్గు శాఖల మంత్రి పీయూష్ గోయల్

4) వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్

**5.** 2019 జనవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాలో శంబర పోలమాంబ జాతరను నిర్వహించారు?

1) శ్రీకాకుళం 2) విజయనగరం 3) అనంతపురం 4) నెల్లూరు

**సమాధానాలు:** 1-4; 2-2; 3-1; 4-3; 5-2.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net